క్లుప్తంగా

నేడు హోం మంత్రి వనిత పర్యటన

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత మంగళవారం ఉదయం పది గంటలకు కొవ్వూరు ఎన్‌జీవో హోం సచివాలయం-1 (శ్రీరామ సొసైటీ)లో నిర్వహించే జగనన్న సురక్ష సభలో పాల్గొంటారు.ఉదయం 11 గంటలకు రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో నిర్వహించే 'జగనన్న తోడు' ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.12.30 గంటలకు తాళ్లపూడి మండలం మలకపల్లిలోను,1.15 గంటలకు చాగల్లులో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న పొగాకు వేలం నిర్వహణాధికారి శ్యామ్

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతల గూడెం ఆర్‌సీఎం చర్చి సమీప పాఠశాలల విద్యార్థులు 200 మందికి గోపాలపురం పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి కె.శ్యామ్ సోమవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఆర్‌సీఎం చర్చి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు సహాయం చేయడంలో నిజమైన తృప్తి ఉంటుందన్నారు. విచారణ గురువులు, సంఘ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రక్షణ సేవాసమితి వితరణ

గోపాలపురం: స్థానిక పెద్దగూడెం గ్రామానికి చెందిన దాసరి రాజబాబు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో స్థానిక రక్షణ సేవాసమితి సభ్యులు సోమవారం ఆయనకు రూ.5వేల నగదు, 25 కేజీల బియ్యం అందజేశారు.కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి జి.ఎలీజా, గౌరవాధ్యక్షుడు బి సాలేం రాజు, టి. ఏసురాజు, ఎ. జాషువాకుమార్, దాసరి రామారావు పాల్గొన్నారు.

ముగిసిన గుబ్బాలమ్మ శాకంబరి ఉత్సవాలు

నిడదవోలు రూరల్: ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని గోపవరం గ్రామంలో నిర్వహించిన గుబ్బాలమ్మ వారి శాకంబరి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. అమ్మవారిని పూలు, పండ్లు, వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి విశేష పూజలు చేశారు. చండీ సప్తశతి హోమం, మహాపూర్ణాహుతి జరిపించారు. ఆలయ మేనేజర్ ఎస్.సూర్యప్రకాశరావు, ఆలయ చైర్మన్ వి.రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి

చాగల్లు: రేషన్ డోర్ డెలివరీలో తమకు ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎండీయూ ఆపరేటర్లు సోమవారం తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. రేషన్ పంపిణీలో ఈ పాస్ మెషీన్‌లో కార్డుదారుడు రెండుసార్లు అవసరం లేకుండా ఒకేసారి వేలిముద్ర వేసేలా చూడాలని కోరారు. నెట్‌వర్క్ సమస్యల పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎండీయూలు పి.సత్యదుర్గాప్రసాద్,సతీష్, వై.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరదొస్తోంది.. పశువులను ఒడ్డుకు చేర్చుకోండి

కొవ్వూరు: గోదావరి నదిలో వరద ఉధృతి క్రమేపీ పెరుగుతున్నందున మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడానికి ముందుగానే నదీ గర్భంలోని గోంగూరలంక, ఇతర లంకల్లో ఉన్న పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కొవ్వూరు పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రాధాకృష్ణ సోమవారం సూచించారు. ఎగువన ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నందున గోదావరి నదికి వరద మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. గోదావరి లంకల్లో మేపుతున్న తమ పశువులను రైతులు ఇళ్లకు తెచ్చుకోవాలన్నారు. గతేడాది గోష్పాద క్షేత్రానికి చెందిన గోవులు వరదలో చిక్కుకున్నాయని ఈ సందర్భంగా రాధాకృష్ణ గుర్తు చేశారు. కాగా పశు సంవర్ధక శాఖ ద్వారా సమీకృత దాణాను సబ్సిడీపై కేజీ రూ.6.50 కే అందిస్తున్నామన్నారు. రైతులు తమ పశువులకు అవసరమైన పశువుల దాణాను సమీప రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆర్డర్ చేసుకుంటే టీఎంఆర్ దాణా సరఫరా చేస్తామన్నారు.

కొట్టి గాయపరిచిన 8 మందిపై కేసు

గోపాలపురం: మండలంలోని భీమోలు గ్రామానికి చెందిన ఖండవల్లి వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని కొట్టి గాయపరిచిన అభియోగంపై అదే గ్రామానికి చెందిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్టు గోపాలపురం ఎస్‌ఐ కె.రామకృష్ణ సోమవారం విలేకరులకు తెలిపారు. భూములపై హక్కు కోసం కొన్నేళ్లుగా ఈ గ్రామంలోని పట్టాదారులకు, కౌలుదారులకు మధ్య వివాదాలు జరుగుతున్నాయి. ఈ వివాదం ప్రస్తుతం కోర్టులో నడుస్తోంది. ఈ క్రమంలో పట్టాదారులు కౌలు రైతు వెంకటేశ్వరరావుపై ఆదివారం దాడికి పాల్పడి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

హాస్టల్ ఫుడ్.. వెరీ గుడ్డు



సమిశ్రగూడెం బీసీ వసతి గృహంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది



సమిశ్రగూడెం బీసీ వసతి గృహంలో భోజనాలు చేస్తున్న విద్యార్థినులు

- వారంలో ఆరు రోజులు గుడ్డు.. మూడు రోజులు చికెన్
- అమల్లోకి కొత్త డైట్ చార్జీలు
- వసతిగృహాల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య

నిడదవోలు రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో సరికొత్త మెనూ అమల్లోకి వచ్చింది. సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. దాంతో హాస్టల్ విద్యార్థులకు రుచికరమైన భోజనం లభిస్తోంది. 'నాడు-నేడు' పథకం ద్వారా ఇప్పటికే వసతి గృహాలను అభివృద్ధి చేసిన ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి మెస్ చార్జీలను పెంచి విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తోంది. నిత్యావసరాల ధరలు పెరగడంతో విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందడం లేదని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం మే నెలలోనే కొత్త డైట్ చార్జీలను ప్రకటించింది. వసతి గృహాలు తెరిచిన వెంటనే కొత్త మెనూ అమల్లోకి రావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన అడ్మిషన్లు

నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమ వసతి గృహాలు తొమ్మిది ఉన్నాయి. వాటి పరిధిలో గతేడాది 670 మంది విద్యార్థులు ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య 900 కి పెరిగింది. సమిశ్రగూడెం బీసీ సంక్షేమ వసతిగృహంలో గతేడాది 98 మంది విద్యార్థినులు ఉండగా ఈ ఏడాది 130 మందికి పెరిగారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాస్టళ్ల విద్యార్థుల కోసం చక్కని మెనూ అమలు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అందుకే అడ్మిషన్లు పెరుగుతున్నాయని హాస్టళ్ల వార్డెన్లు చెబుతున్నారు.

వారంలో మూడు రోజులు చికెన్

కొత్త మెనూ ప్రకారం వసతిగృహాల్లోని విద్యార్థులకు వారంలో మూడు రోజులు చికెన్ కర్రీ, ఆరు సార్లు గుడ్డు, ఉదయం టిఫిన్, పాలు, ఆదివారం కాకుండా సెలవు దినాల్లో మధ్యాహ్నం భోజనంలో అన్నం, సాంబర్, గుడ్డుకూర తప్పనిసరి చేశారు. రోజూ రాత్రి భోజనం తరువాత అరటి పండు ఇవ్వాల్సి ఉంటుంది.

డైట్ చార్జీల పెంపు ఇలా..

మూడు నుంచి ఐదో తరగతి వరకూ గతంలో డైట్ చార్జీలు నెలకు ఒక్కో విద్యార్థికి రూ.1000 ఉండగా ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.1150 పెంచారు. ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1,250 నుంచి రూ.1,400కు, ఇంటర్ ఆపైన చదివే విద్యార్థులకు రూ.1400 నుంచి రూ.1600 పెంపుదల చేశారు.

పెంచిన కాస్మెటిక్ చార్జీలు ఇలా..

కాస్మెటిక్ చార్జీలు మూడు నుంచి ఆరో తరగతి వరకు బాలురకు రూ.110 నుంచి రూ.120, బాలికలకు రూ.110 నుంచి రూ.130కు పెంచారు. ఏడు నుంచి పదో తరగతి బాలురకు రూ.125 నుంచి రూ.150, బాలికలకు రూ.160 నుంచి రూ.200 కు పెంచారు. ఇంటర్ ఆపైన చదివే విద్యార్థులకు రూ.125 నుంచి రూ.200, విద్యార్థినులకు రూ.160 నుంచి రూ.200 వరకూ ప్రభుత్వం పెంచింది. కాస్మెటిక్ చార్జీలను విద్యార్థులు, లేదా వారి తల్లిదండ్రుల ఖాతాల్లోకి నేరుగా ప్రభుత్వమే జమ చేస్తోంది. జూన్ నుంచే పెంచిన కాస్మెటిక్ ఛార్జీలు అమల్లోకి వచ్చాయి.

రుచికరమైన భోజనం



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంతో పాటు హాస్టళ్ల విద్యార్థులకు కూడా రుచికరమైన భోజనం అందుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల మాలాంటి ఎంతో మంది పేద విద్యార్థుల చదువులు సాఫీగా సాగుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా నూతన మెనూ, డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను పెంచడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తాం.

– వేదాల రత్నకుమారి, బీసీ హాస్టల్, సమిశ్రగూడెం

మెనూ పక్కాగా అమలు



నూతన మెనూ అమలుకు చర్యలు తీసుకున్నాం. హాస్టళ్ల విద్యార్థులందరికీ డైట్ చార్జీలు పెంచడంతో పోషకాలతో కూడిన భోజనాన్ని అందిస్తున్నాం. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు రుచికరమైన భోజనం అందించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. హాస్టళ్లలో అడ్మిషన్లు కూడా పెరిగాయి. విధుల్లో నిర్లక్ష్యం వహించే వార్డెన్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– పి.రామకృష్ణ, బీసీ సహాయ సంక్షేమాధికారి, కొవ్వూరు

పాత పద్ధతిలోనే కళాశాలల నిర్వహణ

- రూ. కొన్ని కోట్లు ఖర్చయ్యే అభివృద్ధి పనులకు ఆమోదం
- శ్రీవారి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం



ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ సుధాకరరావు, ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: భీమడోలు, కామవరపుకోటలలోని శ్రీవారి దేవస్థానం కళాశాలలను ప్రభుత్వానికి అప్పగించాలని గతంలో చేసిన తీర్మానాన్ని ధర్మకర్తల మండలి రద్దు చేసింది. కొండపైన పద్మావతి కల్యాణ మండపంలో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అధ్యక్షతన సోమవారం ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. అందులో శ్రీవారి ప్రధాన ఆలయంతో పాటు, ఉప, దత్తత ఆలయాలు, అనుబంధ సంస్థల ఆదాయ, వ్యయాలతో పాటు పలు అభివృద్ధి పనులకు ఆమోద ముద్ర వేశారు. దేవస్థానానికి చెందిన భీమడోలులోని వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల, కామవరపుకోటలోని జూనియర్ కళాశాలకు సంబంధించిన చర, స్థిర ఆస్తులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ప్రభుత్వ నిర్వహణకు అప్పగించేందుకు 2022 సెప్టెంబర్ 15న తీర్మానించారు. అయితే ఆ తీర్మానాన్ని రద్దు చేయడంతో పాటు, ఆ కళాశాలలను పూర్వ పద్ధతిలోనే దేవస్థానం నిర్వహించాలని తాజాగా తీర్మానించారు. కొండపైన శ్రీ ధర్మ అప్పారాయ నిలయం (120 గదుల సత్రం)పై రెండో అంతస్తు నిర్మించేందుకు రూ.9.50 కోట్లతో రూపొందించిన అంచనాలను ఆమోదించారు. ఆలయ ఈశాన్య భాగం నుంచి జంట గోపురాల వరకు రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు రూ.6.30 కోట్ల వ్యయంతో రూపొందించిన అంచనాలను ఆమోదించారు. దేవస్థానానికి సెక్యూరిటీ సిబ్బందిని సప్‌లై చేసేందుకు వచ్చిన టెండర్లలో విజయవాడకు చెందిన అగిల్ సంస్థ టెండర్‌ను ఆమోదించారు. శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన మైలవరంలోని వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి చెందిన విజయవాడ రోడ్డులోని ఖాళీ స్థలములో వివాహాలు జరుపుకునేందుకు కల్యాణ మండపాన్ని, 8 సూట్ రూమ్‌లు, డైనింగ్ హాలు 'జీ ప్లస్ వన్' నిర్మాణానికి రూ. 5.10 కోట్లతో రూపొందించిన అంచనాలను ఆమోదించారు. సమావేశంలో ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గురికి 'మానవత ' ఆర్థిక సాయం

నల్లజర్ల: వివిధ ప్రమాదాల్లో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న చీపురుగూడేనికి చెందిన కటారి భోగరాజు, వెలగన చంద్రరావు, గుత్తాల సుధీర్‌కుమార్‌లకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున రూ.9 వేల సాయాన్ని మానవత సంస్థ మండల శాఖ సోమవారం సాయంత్రం అందజేసింది. కార్యక్రమంలో ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షులు ఐడీవీ అప్పారావు, చైర్మన్ భోగవల్లి వెంకటసుబ్బారావు, తలంశెట్టి మాధవరావు, ఎస్.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నిడదవోలు : కృష్ణా జిల్లా ముువ్వ కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోరుపర్తి శ్రీనివాసరావుపై కొందరు దుండగులు దాడి చేసి హత్యాయత్నం చేయడాన్ని నిరసిస్తూ నిడదవోలు జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించి ధర్నా చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ములగాలి రవికుమార్, ఉపాధ్యక్షుడు వెలగన లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి డేగపాటి మహేష్‌లతో పాటు ముప్పిడి మంగయ్య, జి.గాబ్రియేలు, ఆకుతోట సతీష్‌కుమార్, యుఎంఎల్ ప్రసన్న, ఎంఎస్ఆర్ ప్రసాద్, నక్కా వెంకటేశ్వర్లు, ఎం.అర్జునుడు, ఎండీ మహబూబ్ పాల్గొన్నారు.

పింఛనుదారు వేలిముద్రల వెతలు తీరాయి

వలంటీర్లకు వందనం

పింఛను సొమ్ము తీసుకునేందుకు ప్రతినెలా మొదటి వారంలో వృద్ధులు పడుతున్న అవస్థలు వలంటీర్ల వ్యవస్థ వచ్చాక తొలగిపోయాయి. మలకపల్లి రజకపేటకు చెందిన వృద్ధురాలు దువ్వాపు చంద్రమ్మకు పింఛనుదారు. ఆమెకు కంటి చూపు మందగించింది. పైగా ఆమె రెండు చేతి వేళ్లు అరిగిపోవడంతో వేలి ముద్రలు పడక పింఛను సమయంలో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఈ విషయాన్ని ఆ ఏరియా వలంటీర్ పుల్లా సునీతా తెలుసుకుని సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లింది. చంద్రమ్మకు నేరుగా ఫేస్ యాప్ ద్వారా ప్రతి నెలా పింఛను సొమ్ము చెల్లించేలా అధికారులు అంగీకరించారు. దాంతో ఆ వృద్ధురాలి సమస్య తీరింది.

– తాళ్లపూడి



మలకపల్లిలో వృద్ధురాలికి పింఛను సొమ్ము అందిస్తున్న వలంటీర్ పుల్లా సునీత

అమ్మాయి రుణం తీర్చుకోలేను



మా వలంటీర్ సునీత సేవలు మరచిపోలేను. ఎందుకంటే నాకు రెండు చేతుల వేళ్లు పూర్తిగా అరిగిపోయాయి. కళ్లు కూడా సరిగా కనబడవు. గతంలో పింఛను కోసం ఉదయం వెళితే సాయంత్రం ఇంటికి వచ్చే దానిని. అయినప్పటికీ పింఛను సొమ్ము అందేది కాదు. నా సమస్యను వలంటీర్ పరిష్కరించింది. ఆ అమ్మాయే ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయమే ఇంటికి వచ్చి పింఛను సొమ్ము చేతిలో పెట్టి నవ్వుతూ పలకరిస్తుంది.

– దువ్వాపు చంద్రమ్మ, వృద్ధురాలు, మలకపల్లి

స్క్రిప్టు చంద్రబాబుది.. ఆరోపణలు పవన్‌వి

- దేశానికే ఆదర్శం రాష్ట్రంలోని వలంటీర్ల వ్యవస్థ
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నోటి నుంచి వచ్చే ప్రతి మాటా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు రాసిచ్చిన స్క్రిప్టు అని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విమర్శించారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రామ వలంటీర్లపై పవన్ చేసిన ఆరోపణలను తలారి తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ వలంటీర్ల వ్యవస్థను ప్రపంచ దేశాలు ప్రశంసిస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాల అమలు, గ్రామ వలంటీర్ల వ్యవస్థతో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వలంటీర్లు సేవాభావంతో పనిచేస్తూ కోట్లాది ప్రజల మన్ననలు పొందుతున్నారని తలారి అన్నారు. అలాంటి వలంటీర్లపై పవన్‌కల్యాణ్ అసత్యపు ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఏకవచనంతో సంభోదించడం జనసేన అధినేతక తగదని హితవు పలికారు.

30 వేల ధ్రువ పత్రాల పంపిణీ

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గోపాలపురం నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 42 గ్రామ సచివాలయాలను సందర్శించి, గ్రామసభలు నిర్వహించినట్టు ఎమ్మెల్యే తలారి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి 30 వేల మంది లబ్ధిదారులకు 11 రకాల ధ్రువ పత్రాలను ఉచితంగా అందజేసినట్టు చెప్పారు. విలేకరుల సమావేశంలో దేవరపల్లి, గోపాలపురం ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో హలో బీసీ.. చలో ఢిల్లీ

కొవ్వూరు: చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచాలని కోరుతూ ఈనెల 24, 25 తేదీల్లో హలో బీసీ.. చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షురాలు అనసూరి పద్మలత కోరారు. కొవ్వూరు పట్టణంలోని రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఏలూరి విజయలక్ష్మి స్వగృహంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మహిళా బిల్లులో బీసీ మహిళల జనాభా ప్రకారం సబ్ కోటా కేటాయించాలన్నారు. మహిళలపై హింసను ప్రేరేపించే విధంగాను, అశ్లీల దృశ్యాలు పూర్తిగా నిషేధించాలన్నారు. మహిళలపై జరిగే అకృత్యాలను, అత్యాచారాలను, గృహ హింసలను అరికట్టాలన్నారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. ఈ డిమాండ్లతో ఈనెల 24, 2 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా విభాగం తరఫున నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి ఏలూరి విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లేపల్లి సుభాషిణి, రాజమహేంద్రవరం సిటీ సంఘ కార్యదర్శులు రామేశ్వరపు భార్గవి, సలాది వీరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

నల్లజర్ల: కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమం చేపట్టినట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.1.04 కోట్ల వ్యయంతో పోతవరం గ్రామంలో నిర్మించే 60 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకు, ఐదు కిలోమీటర్ల పొడవైన పైపులైను పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.39 కోట్ల వ్యయంతో మొదటి, రెండో దశ తాగునీటి సరఫరా పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులతో పాటు దాదాపు 125 కిలోమీటర్ల పొడవైన పైపులైన్లను నల్లజర్ల ,దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో వేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పాపా నాగేశ్వరరావు, చిడిపి చింతయ్య, బంక అప్పారావు, పిచ్చుకుల ప్రసాద్, కారుమంచి రమేష్, పెండ్యాల హరేరామకృష్ణ, పెండ్యాల వీరరాఘవులు, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఏఈ అజయ్‌బాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక సురక్ష

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- పలు ప్రాంతాల్లో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ



దేవరపల్లి మండలం దుమంతునిగూడెంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



నిడదవోలులో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న చైర్మన్ ఆదినారాయణ

దేవరపల్లి: ప్రజా సమస్యలను పరిష్కరించడానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని ధుమంతునిగూడెం సచివాలయం వద్ద సర్పంచ్ శ్రీరంగం రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ధుమంతునిగూడెంలో 217 మందికి కుల, 194 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించారు. అలాగే 15 మందికి కొత్త రేషన్ కార్డులు, 751 మంది రైతులకు అడంగల్ పత్రాలు, 10 మందికి కౌలు కార్డులు, ఐదు ఆరోగ్యశ్రీ కార్డులు మొత్తం 1202 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. గ్రామంలోని జగనన్న లే -అవుట్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లానని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న 22 మందికీ ఇళ్లస్థలాల పట్టాల ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే తలారి ఆదేశించారు. రోడ్లు, డ్రైన్ల సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పార్టీ మండలశాఖ అధ్యక్షుడె కూచిపూడి సతీష్, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెం సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు, రేషన్ కార్డులను ఆయన అందజేశారు. ముందుగా రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, బొండాడ వెంకన్నబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ బాషా తదితరులతో కలిసి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

పోతవరం-2 సచివాలయం వద్ద 1444 ధ్రువీకరణ పత్రాలు

నల్లజర్ల: మండలంలోని పోతవరం సచివాలయం -2 వద్ద సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కులధ్రువీకరణ పత్రాలు 584, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 557, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్-1, ఇతర సేవలకు సంబంధించి 153 ధ్రువీకరణ పత్రాలను (మొత్తం 1444) లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ పథకమైనా, ఏ ధ్రువపత్రమైనా అందని అర్హులకు అండగా నిలిచే జగనన్న సురక్ష కార్యక్రమం ఈనెలాఖరు వరకూ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి తో పాటు పాపా నాగేశ్వరరావు, చిడిపి చింతయ్య, పిచ్చుకుల ప్రసాద్, బంక అప్పారావు, దూలపల్లి ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, ఎంపీడీఓ రాజశేఖరం, తహసీల్దారు కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు వార్డుల్లో 1077 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు

నిడదవోలు: పట్టణంలోని 19, 20 వార్డుల ప్రజల కోసం స్థానిక 13వ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యాక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు కుల ధ్రువీకరణ పత్రాలు 1077, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 1092, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు 5, రైస్ కార్డులు 2 చైర్మన్ ఆదినారాయణతో పాటు కౌన్సిలర్ల చేతుల మీదుగా అందజేశారు. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ ఎస్‌కే చాన్‌బాషా, కౌన్సిలర్లు అహ్మదున్నీసా బేగం, దాకే అనిల్‌కుమార్, కామిశెట్టి సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పశివేదలలో 2,701 సమస్యల పరిష్కారం

కొవ్వూరు: జగనన్న సురక్షలో భాగంగా పశివేదల-1, 2, సచివాలయాల పరిధిలో 2,701 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అధికారులు అందజేశారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో నిర్వహించిన సమావేశంలో ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుని విజ్ఞప్తులు స్వీకరించారు. ప్రధానంగా కులధ్రువీకరణ సర్టిఫికెట్లు 581 మందికి, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 586 మందికి, రీ ఇష్యూ ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు 345 మందికి జారీ చేశారు. 59 మంది ఆధార్ నంబర్‌తో మొబైల్ లింకేజీ చేశారు. ఇద్దరికి కొత్త రేషన్ కార్డులు జారీ చేశారు. అడంగల్ సమస్యలు 108 మందికి, 71 మంది కౌలుదారులకు సీసీఆర్‌సీలు అందజేశారు. వైస్ ఎంపీపీ నూతంగి రేఖ, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, మాజీ ఉప సర్పంచ్ వేములపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

దుద్దుకూరులో పొలంబడి

దేవరపల్లి: పప్పు దినుసుల్లోని పిండి సూక్ష్మ జీవులకు ఆహారమని ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం వారు దుద్దుకూరులోని రైతు కాకర్ల చంద్రమౌళి పొలంలో సోమవారం పొలంబడి నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. నాట్లు వేసి 15 రోజుల దాటిన వరి పైరును ఆయన పరిశీలించి రైతుకు సూచనలు చేశారు. ప్రతి సోమవారం పొలంబడి నిర్వహిస్తున్నట్టు శ్రీనివాస్ తెలిపారు. జీవామృతాన్ని తయారు చేసి రైతులకు చూపించారు. పుట్టమట్టి వల్ల సూక్ష్మజీవులు పెరుగుతాయని, దీని వల్ల చీడపీడలు దరిచేరవని చెప్పారు.

సహజంగా జీవించడం అలవాటు చేసుకోవాలి

చాగల్లు: ప్రతిఒక్కరూ సహజంగా జీవించడం అలవాటు చేసుకోవాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ టి.వీరజగదీశ్వరి అన్నారు. నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో చాగల్లు మండలంలోని ఎస్.ముప్పవరం గ్రామంలో సోమవారం ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ధ్యానం ద్వారా ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం, బుద్ధి కుశలత, అధ్యాత్మిక జ్ఞానం పెరుగుతుందన్నారు. ధ్యానం సర్వ రోగ నివారిణి, ధ్యానం సత్యజ్ఞాన ప్రసాదిని, సకల భోగాల ప్రసాదిని అని ఆమె అన్నారు. ధ్యానం చేయడం వలన శారీరక, నాడీ మండల శుద్ధి కలుగుతుందన్నారు. నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఏంఎ ప్రసాద్ మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న ధ్యాన మందిరాన్ని పూర్తి చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ధ్యానం చేసిన వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ధ్యానం వలన కలిగే లాభాలు, ఆత్మశక్తి, సంకల్ప శక్తి గురించి వివరించారు. కార్యక్రమంలో చాగల్లు, దారవరం, పశివేదల, ఊనగట్ల, నిడదవోలు తదితర ప్రాంతాల ధ్యానులు పాల్గొన్నారు.